సాక్షి పెద్దపల్లి

సోమవారం ↑ 30 ↑ అక్టోబర్ ↑ 2023

ఓదెల మల్లన్నకు బోనాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి పట్నాలు వేశారు. కోడెమొక్కులు చెల్లించారు. మల్లికార్జునస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరుడు, సీతారామచంద్రస్వామిని దర్శనం చేసుకున్నారు. ఒగ్గు పూజారులతో బోనాలు సమర్పించారు. హుండీలో కట్నం, కానుకలు వేశారు. ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, వైస్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పట్నాలు వేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

రూ.73వేల నగదు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేశారు. గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన గుండోజి రాజ్ పెళ్లి బట్టలు కొనుగోలు చేసేందుకు కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఆయన కారును స్థానిక చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అందులో రూ.73వేల నగదు లభించింది. దీంతో ఆ సొమ్మును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు విజేందర్, అశోక్‌రెడ్డి, వినీత పాల్గొన్నారు.

క్రీడల కోట 'ఖని'



పోటీలు ప్రారంభిస్తున్న కొమురోజు శ్రీనివాస్

జ్యోతినగర్(రామగుండం): ఖని క్రీడలకు కోట అని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని తిరుమల వెంకటగార్డెన్స్(టీవీ)లో ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అండర్-14, 17లోని విద్యార్థులు 250 మంది పోటీలకు హాజరయ్యారని, ఇందులో 40 మంది ఎంపికయ్యారని తెలిపారు. కొయ్యడ శ్రీనివాస్, మానస, అనుత్తమ్‌రెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్లు తగరపు శంకర్, వడ్డేపల్లి సురేశ్, శ్రీనివాస్, పసునూరి శంకర్, నాగరాజు, రాము, గౌరు రాజిరెడ్డి, సురభి వేణుగోపాల్, పేటా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు సోమశేఖర్, అబ్జర్వర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రాక్షసపాలనకు చరమగీతం'



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, ప్రజలు ఆశీర్వదించి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు, రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఆదివారం స్థానిక ఆర్కే గార్డెన్‌లో నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాల ఏజెంట్లకు ఎన్నికల శిక్షణ ఇచ్చారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మనోహర్‌జోషితో కలిసి చందర్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 80సీట్లు సాధిస్తుందన్నారు. రాజకీయంగా దెబ్బతీయాలనే ఆలోచనతో బీఆర్‌ఎస్ కట్టుల సంచులతో తిరుగుతోందని విమర్శించారు. కేసులకు భయపడే ప్రసక్తేలేదని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటానని అన్నారు. నాయకులు బొంతల రాజేశ్, మారెల్లి రాజిరెడ్డి, మహంకాళి స్వామి, శంకర్‌నాయక్, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే కష్టాలు తీరుస్తా..

తనను గెలిపిస్తే ప్రజల కష్టాలు తీరుస్తానని రాజ్‌ఠాకూర్ అన్నారారు. గంగానగర్‌లోని లారీ యజమానుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఇక్కడి ఇసుక, బూడిద దోపిడీ చేశారని, ఉద్యోగాల పేరిట రూ.6 లక్షల - రూ.10లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు.

22 ఏళ్లు.. మూడు గుర్తులు



పోరాడి రాజులు అవుతారో.. అమ్ముకొని బానిసలు అవుతారో.. నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.
– బీఆర్ అంబేడ్కర్

మీకు తెలుసా?

కరీంనగర్: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ పురుడు పోసుకొని సరిగ్గా 22 ఏళ్లయింది. 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించి ప్రస్తుతం బీఆర్‌ఎస్‌గా రూపాంతరం చెందింది. 22 ఏళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ మూడు గుర్తులతో ఎన్నికల బరిలోకి దిగింది. పార్టీ ఆవిర్భావం జరిగాక సిద్దిపేట ఎమ్మెల్యే పదవి, డిప్యూటీ స్పీకర్ పదవికి సీఎం కేసీఆర్ రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన సిద్దిపేట ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి బస్సు గుర్తును కేటాయించారు. వెనువెంటనే వచ్చిన స్థానిక సంస్థల (2001)ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి రైతు నాగలి గుర్తును కేటాయించారు. అనంతరం 2004వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు కారు గుర్తు కేటాయించడంతో ఆ గుర్తు బీఆర్‌ఎస్‌కు సొంతమైంది.

మనోళ్లు సీనియర్లే!



- అసెంబ్లీలో సీనియర్లంతా ఉమ్మడి జిల్లావారే..!
- నాలుగు నుంచి ఏడుసార్లు శాసనసభకు ఎన్నిక
- ఉద్యమాల గడ్డ కావడమే ప్రధాన కారణం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్కూల్.. కాలేజీ.. పనిచేసే చోట.. అంతెందుకు కుటుంబంలోనూ చిన్నా, పెద్ద, సీనియర్, జూనియర్ అన్న వ్యత్యాసాలు సర్వసాధారణం. ఇందుకు అసెంబ్లీ కూడా మినహాయింపు ఏమీ కాదు. ఇప్పుడున్న సభలో ఉమ్మడి రాష్ట్రం నుంచి వరుసగా ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా.. విజయం సాధిస్తున్న ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారు. వీరిని సీనియర్ శాసనసభ్యులు అంటూ స్పీకర్, తోటి ఎమ్మెల్యేలు సంబోధించడం పరిపాటి. అది ఆయా నియోజకవర్గాల్లో ఆ ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాబలం, సభలో వారికి ఉన్న అనుభవానికి తోటి సభ్యులు ఇచ్చే మర్యాద, గౌరవాలకు సూచన. అలాంటి సీనియర్ ఎమ్మెల్యేల్లో అధికశాతం మంది కరీంనగర్ జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం సభలో ఉన్న సభ్యులను మిగిలిన జిల్లాల సభ్యులతో పోల్చినపుడు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలే సీనియర్లుగా నిలుస్తున్నారు. వీరిలో మెజారిటీ గులాబీ పార్టీకే చెందిన వారు కావడం విశేషం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షతో పురుడుపోసుకున్న పార్టీ నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి)కి మొదటి నుంచి కరీంనగర్ జిల్లాలో పట్టు ఎక్కువ. అందుకే రాష్ట్ర సాధనలో భాగంగా పలుమార్లు రాజీనామాలు చేయడం.. తిరిగి ఉప ఎన్నికల్లో విజయం సాధించడంతో వీరు తమతోపాటు సభకు ఎంపికైన తోటి ఎమ్మెల్యేల కంటే అత్యధిక సార్లు విజయం సాధించిన నేతలుగా అరుదైన గుర్తింపు సాధించారు. ప్రస్తుతం జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ శాసన సభకు మూడోవి. అదే సమయంలో సభలో కనిష్ఠంగా రెండు నుంచి గరిష్ఠంగా ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినవారు సభలో ఉండటం గమనార్హం. ఉమ్మడి రాష్ట్రంలో వారు సాధించిన వరుస విజయాలే వారి సీనియారిటీకి కారణం.

7 సార్లు



ఈటల రాజేందర్ టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 ఎన్నికల్లో మొత్తం ఏడుసార్లు విజయం సాధించారు. ఇందులో 2008, 2010, 2021 ఉప ఎన్నికలు ఉన్నాయి. 2021లో ఆయన బీజేపీలో చేరి విజయం సాధించడం గమనార్హం.

6 సార్లు



ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983, 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నారు.

6 సార్లు



మంత్రి కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి మొత్తం ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు.

4 సార్లు



సిరిసిల్ల నుంచి కేటీఆర్, వేములవాడ నుంచి చెన్నమనేని రమేశ్ బాబు, కోరుట్ల నుంచి కె.విద్యాసాగర్‌రావు 2009, 2010, 2014, 2018లో వరుసగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇందులో 2010లో ఉప ఎన్నిక కావడం విశేషం. ప్రస్తుతం రమేశ్‌బాబు, విద్యాసాగర్‌రావు ఈ సారి పోటీలో లేరు.

4 సార్లు



మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 1999, 2004, 2009లో కాంగ్రెస్ నుంచి వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. 2014లో ఓడినప్పటికీ 2018లో తిరిగి శాసనసభకు నాలుగోసారి ఎన్నికయ్యారు.

3 సార్లు



గంగుల కమలాకర్ 2009, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారు. ఈ విజయాలతో కరీంనగర్‌లో తన పేరిట కొత్త రికార్డు లిఖించుకుని, నాలుగోసారి విజయంపై కన్నేశారు.

దివంగత మాజీ ఎమ్మెల్యేల రికార్డు

4 సార్లు



కమలాపూర్ ఎమ్మెల్యేగా దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి 1985, 1989, 1994, 1999లో నాలుగు సార్లు విజయం సాధించారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

6 సార్లు



దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు 1957లో చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 1967, 1978, 1985, 1994, 2004లో ఆరుసార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు.

4 సార్లు



దివంగత దేశిని చిన్నమల్లయ్య 1978, 1984, 1989, 1994లో ఇందుర్తి (ప్రస్తుతం హుస్నాబాద్) నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి

మంథని: ఆర్‌ఎంపీ, పీఎంపీలు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని, వారి సేవాస్ఫూర్తికి తగిన సహకారం అందిస్తానని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంథని కేంద్రంగా భవనం నిర్మిస్తామని మధు అన్నారు. పేదలకు సేవ చేయాలని, హైదరాబాద్‌లో ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి ఆస్పత్రి ఏర్పాటు చేసుకుని ఉచితంగా సేవలు అందిస్తోందని, వారిసేవలు ఎంతో గొప్పవన్నారు. అలాంటి సేవలు మంథని లాంటి ప్రాంతంలో ఉంటే ఎంతోమంది పేదలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అనేక ఏళ్లు ఈ ప్రాంతంలో పాలించిన కాంగ్రెస్.. ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. మీలాంటి వాళ్ల సమస్యలను విస్మరించారని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న పుట్ట మధు

ఆధారాలు చూపకుంటే అంతే..!

- ఎన్నికల కోడ్ అమలుతో పెరిగిన నిఘా
- జిల్లాలో నాలుగు చెక్‌పోస్టుల ఏర్పాటు
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ
- తనిఖీల వివరాలు వీడియో చిత్రీకరణ

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్లు, మద్యం.. ఇలా వస్తుసామగ్రిని ఆధారాలు లేకుండా వెంట తీసుకెళ్తే జిల్లా సరిహద్దుల్లోని చెక్ పోస్టులు, తనిఖీ బృందాలకు చిక్కితే సీజ్ చేస్తున్నారు.

'కోడ్' ఉల్లంఘనులను గుర్తించేందుకు..

- జిల్లాలో ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్ టీం, అకౌంటింగ్ టీం, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ (ఏఈఓ)లను నియమించారు.
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉచితాల పంపిణీని నియంత్రించేందుకు ఈ బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయి.

సీజ్ చేసే సమయంలో రికార్డింగ్..

ఆధారాలు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే వాటిని స్వాధీనం చేసుకునే సమయంలో ప్రతీ అంశాన్ని వీడియోలో చిత్రీకరిస్తున్నారు. ప్రతీఅంశాన్ని వీడియోలో రికార్డు చేయడంతోపాటు ఆధారాలతో వచ్చి వాటిని ఎవరికి అందించాలో సదరు వ్యక్తులకు వివరిస్తున్నారు. సీజ్‌చేసే సమయంలో ఎంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారనే వివరాలతో కూడిన రసీదును కూడా సంబంధిత తనిఖీ అధికారులు సదరు వ్యక్తులకు అందిస్తున్నారు.

జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు..

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం తదితర వస్తుసామగ్రిని అక్రమంగా తరలించకుండా నిరోధించేందుకు జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి, మంథని మండలం ఎగ్లాస్‌పూర్, గోదావరి బ్రిడ్జి, కాళేశ్వరం-సిరోంచ సరిహద్దు వద్ద వీటిని ఏర్పాటు చేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద కూడా సీసీ కెమెరాలు అమర్చారు. వాటిల్లో రికార్డు అయ్యే విషయాలను అప్పటికప్పుడే జిల్లా మానిటరింగ్ సెల్‌లో పర్యవేక్షించేలా అనుసంధానించారు. 1950టోల్‌ఫ్రీ, సీ విజిల్‌యాప్ ద్వారా అందే ఫిర్యాదులపై అప్రమత్తం చేసి కేవలం 100 నిమిషాల్లోనే ఘటనాస్థలానికి చేరుకునేలా అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేసింది.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉల్లంఘనులపై సమాచారమివ్వండి



ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించిన వారెవరైనా టోల్‌ఫ్రీ నంబరు 1950, సీ విజిల్‌యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి. ఇప్పటివరకు సీ విజిల్ యాప్ ద్వారా 51 ఫిర్యాదులు, 1950 ద్వారా 917ఫిర్యాదులు అందాయి. సీజ్ చేసిన 30 డీజేబాక్సులు (రూ.4.63లక్షల విలువ) కు సంబంధించి ఎవరూ ఆధారాలతో రాలేదు. సీజ్‌చేసే సమయంలో నిబంధనలకు లోబడే ప్రతీఅంశాన్ని వీడియోలో చిత్రీకరిస్తున్నారు. ధాన్యం అమ్మే రైతులు తమ సొమ్ముకు తగిన ఆధారాలను వెంట ఉంచుకోవాలి.

– ముజమ్మిల్ ఖాన్, జిల్లా ఎన్నికల అధికారి

రూ.94.63లక్షల జప్తు..

జిల్లాలో చేపట్టిన తనిఖీల ద్వారా ఇప్పటివరకు రూ.94,63,860 నగదును అధికారులు సీజ్‌చేశారు. ఆ తర్వాత సదరు వ్యక్తులు చూపిన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్‌కమిటీ పరిశీలించి రూ.89,49,850 విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. నగదుతోపాటు 42.082కిలోల వెండి, 29 యాంప్లిఫ్లయర్‌లు, 58 డీజేబాక్సులు, 58గ్రాముల బంగారం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి 91828 62887లో సంప్రదించాలని అధికారవర్గాలు సూచించాయి.

బలమైన రాజకీయ పార్టీ బీఆర్‌ఎస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నారదాసు లక్ష్మణ్‌రావు

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: సుమారు 60 వేల సాధారణ, 15 వేల క్రియాశీలక సభ్యులు కలిగి రామగుండంలో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా అవతరించిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. స్థానిక ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమన్నారు. నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రోడ్లు, డ్రైనేజీలు, చౌరస్తాల సుందరీకరణ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కళాశాల, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, రూ.26కోట్లతో సివిల్ జడ్జి కోర్టు భవనం మంజూరు చేయించామని అన్నారు. సీఎం కేసీఆర్ సంపద పెంచుతూ పేదలకు పంచుతున్నారని ఆయన తెలిపారు. ఇంతచేస్తున్నా ఓర్వలేని కొందరూ సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా, సీపీకి ఫిర్యాదు చేస్తామని అన్నారు. తనకు సంబంధంలేని విషయాలు అంటగడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు మాదాసు రామ్మూర్తి, నడిపెల్లి మురళీధర్ రావు, చెరుకు బుచ్చిరెడ్డి, నూతి తిరుపతి, తోడేటి శంకర్‌గౌడ్, ఇంజపురి నవీన్, నారాయణదాసు మారుతి, చల్లగురుగుల మొగిలి, పర్లపల్లి రవి, రాకం దామోదర్, జక్కుల తిరుపతి, చిప్ప రాజేశం, అమరేందర్, జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ముప్పే.. తప్పేట్టు..

- గోదావరి తీరంలో కరకట్ట నిర్మాణం తప్పనిసరి
- వరదలొస్తే బ్యాక్‌వాటర్‌తో కాలనీలు జలమయం
- ఏటా పారిశ్రామిక ప్రాంతవాసుల వెతలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు విముక్తి ఎప్పుడు?

గోదావరిఖని: గతంలో కురిసిన భారీవర్షాలతో మల్కాపూర్, సప్తగిరికాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డికాలనీ, గంగానగర్, రఘుపతిరావునగర్, ఎన్టీపీసీ మేడిపల్లిలోని సుమారు 10వేల కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయి. ఇళ్లలోకి నీళ్లు చేరడంతో వందలా మంది నిరాశ్రయులయ్యారు. వరద బాధితులను లోతట్టు ప్రాంతాల నుంచి బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఎన్నికల్లోనైనా ఆయా పార్టీలు ప్రధానమైన ఈ సమస్యను తమ మేనిఫెస్టోల్లో చేర్చి ముంపు నుంచి విముక్తి కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

భారీవర్షాలే కారణం..

- కాళేశ్వరం నిర్మాణంతో గోదావరి నదిలో నీటి నిల్వలు భారీగా పెరుగుతున్నాయి.
- ప్రధానంగా బ్యాక్‌వాటర్‌తో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి కొత్త సమస్య ఎదురైంది.
- దీనికితోడు భారీవర్షాలతో వరద పోటెత్తి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి.
- పంట పొలాలు, నివాసాలు నీటమునిగి ఒక్కో కుటుంబం రూ.లక్షల్లో నష్టపోతోంది.
- సుందిళ్ల పార్వతీ బ్యారేజీ ఎగువన ఉన్న గోదావరిఖని ప్రాంతానికి వరద ముప్పు తప్పడం లేదు.
- భారీవర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.



నీటమునిగిన సప్తగిరికాలనీ(ఫైల్)

- సుమారు 30 ఏళ్లక్రితం వరదలతో గోదావరి నది ఉప్పొంగింది.
- పవర్‌హౌస్‌కాలనీ, గంగానగర్ వరకు వరద పోటెత్తింది.
- కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన సుందిళ్ల పార్వతీబ్యారేజీతో బ్యాక్‌వాటర్ పోటెత్తి ముప్పు మరింత పెరిగింది.
- గోదావరిఖనిలోని ప్రశాంత్‌నగర్, సప్తగిరికాలనీ, రెడ్డికాలనీ, మల్కాపూర్, రఘుపతిరావునగర్, మేడిపల్లి ప్రాంతాలు ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి.

కరకట్ట లేకనే..

సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంతో బ్యాక్‌వాటర్ నివాసాలను ముంచెత్తుతుందని అధికారులు ముందే గుర్తించారు. కానీ, ముంపు నుంచి లోతకట్టు ప్రాంతాలను రక్షించేందుకు కరకట్ట నిర్మించాలనే విషయాన్ని విస్మరించారు. సిరిపురం వద్ద నిర్మించిన బ్యారేజీ నుంచి సుమారు 5 కిలోమీటర్ల మేర.. అంటే సుందిళ్ల గ్రామం వరకు కరకట్ట నిర్మించారు. గ్రామాల నుంచి వచ్చే వరద, వర్షపునీరు వెళ్లేందుకు డైవర్షన్ నాలా కూడా కట్టించారు. దీంతోపాటు మరో 5కిలో మీటర్ల మేర కరకట్ట పొడిగిస్తే గోదావరిఖని ప్రాంతానికి వరద ముప్పు ఉండేది కాదని నిపుణులు పేర్కొంటున్నారు.

రూ.110కోట్లతో అంచనాలు..

- గోదావరి నదీతీరంలో కరకట్ట నిర్మాణానికి అధికారులు రూ.110కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు.
- కరకట్ట నిర్మాణంతోపాటు వరద, వ్యర్థాలు నేరుగా నదిలో కలువకుండా వరదకాలువ డైవర్షన్ చేయవచ్చని పేర్కొన్నారు.
- అంతా బాగానే ఉన్నా ఇది ఇప్పటి వరకూ ఆచరణలోకి రాలేదు.

ముప్పు నుంచి తప్పించేందుకు..

వరద(బ్యాక్‌వాటర్) ముంపు నుంచి లోతట్టు ప్రాంతాలను తప్పించేందుకు సముద్రమట్టానికి సుమారు 132 మీటర్ల ఎత్తులో సుందిళ్ల బ్యారేజీ నిర్మించేందుకు డిజైన్ చేశారు. దాన్నిమార్పు చేసి 138మీటర్ల ఎత్తుకు పెంచారు. దిగువకు 8లక్షల క్యూసెక్కులు వదలాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో సుమారు 15 నుంచి 20 లక్షల క్యూసెక్కులు విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతసామర్థ్యం లేకపోవడంతో గోదావరి నదికి ఇరువైపులా బ్యాక్‌వాటర్, వరద భారీగా పోటెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోదావరిఖని గంగానగర్ సమీపంలో రాజీవ్ రహదారిపై నుంచి వరద ప్రవహించింది. గతంలో ఎన్నిభారీవర్షాలు కురిసినా ఇలాంటి పరిస్థితి రాలేదని పీపుల్స్ గుర్తుచేసుకుంటున్నారు.

మంత్రి దృష్టికి ప్రధాన సమస్య



వెంటనే కరకట్ట నిర్మించి ఈప్రాంతానికి వరద ముప్పులేకుండా చూడాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఇటీవల మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వరద ముప్పు తప్పించేందుకు సుందిళ్ల నుంచి గోదావరిఖని వరకు సుమారు 5కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మాణానికి రూ.110కోట్లు అవసరమన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ రాష్ట్ర వర్క్‌షాప్ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు మాట్లాడుతూ... గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. డిసెంబర్‌లో సింగరేణి గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయన్నారు. నాయకులు ఎరవెల్లి ముత్యంరావు, మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, గజేంద్ర, మహేశ్, రాజమౌళి, ప్రవీణ్, మొగిలి, ఎస్.వెంకన్న, తోట నరహరిరావు, బాలాజీ, గోదారి భాగ్యరాజు, శ్రీనివాస్, ఎస్.వెంకటస్వామి, రాజేందర్ పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

గనుల్లో ఎన్నికల ప్రచారం నిషేధం

గోదావరిఖని: సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్లలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిషేధమని ఆర్జీ–2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ సర్క్యులర్ సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/డీ/ 98/1251 ప్రకారం రాష్ట్ర శాసనసభకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సింగరేణి సంస్థలోని గనులు, విభాగాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఏ పార్టీ అభ్యర్థిని అనుమతించరాదన్నారు. ఎన్నికల ప్రచారానికి ఎవరైనా ఉద్యోగి హాజరైనట్లయితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఎన్నికల సంఘం అధికారులకు సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేత

రామగుండం: కుంభకోణాలు, అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత అన్నారు. ఆదివారం రాత్రి రామగుండంలో ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే, విప్ బాల్క, ఎంపీలు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఎన్నికల కోడ్‌తో బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం సమస్యను పరిష్కరించలేకపోతున్నామని, అధికారంలోకి వచ్చిన వారంలోపే నూతన విద్యుత్ కేంద్రం స్థాపన చేయడం ఖాయమని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. అనంతరం పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎంపీ వెంకటేశ్ నేత, నియోజకవర్గ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే చందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నేత కౌశిక హరి అధ్యక్షత వహించగా పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, కార్పొరేటర్లు ముదాం శ్రీనివాస్, కౌశిక లత, సతీశ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ షమీమ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

తోపుడు రిక్షాలతో ప్రచారం


గోదావరిఖని: రామగుండం ఎన్నికల్లో ప్రచారం నిర్వహించేందుకు ముస్తాబైన రిక్షాలను ఎమ్మెల్యే చందర్ ఆదివారం ప్రారంభించారు. ఎకోఫ్రెండ్లీ ప్రచార రిక్షాలను తయారు చేసిన నాయకులు తోట వేణును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జి నారదాసు లక్ష్మణ్‌రావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు హుజూరాబాద్ పట్టం



- 1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు
- హుజూరాబాద్‌లోకి కమలాపూర్
- కమలాపూర్‌లో ముద్దసాని.. హుజూరాబాద్‌లో ఈటల మార్క్


హుజూరాబాద్: ఉద్యమాలకు కేంద్ర బిందువైన హుజూరాబాద్ 1957లో (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గంగా ఏర్పడి మూడేళ్లకే జనరల్ స్థానంగా మారింది. ఇందులో హుజూరాబాద్, భీమదేవరపల్లి తాలూకాలుగా ఉండేవి. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో మూడు ఉప ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగుసార్లు, టీడీపీ, స్వతంత్రులు మూడుసార్లు చొప్పున, ఇక బీఆర్‌ఎస్ ఏకంగా ఆరుసార్లు విజయం సాధించింది. 2021లో వచ్చిన ఉప ఎన్నికలో బీజేపీ గెలిచింది. ఇక్కడి నుంచి గెలిచిన ఇనుగాల పెద్దిరెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు మంత్రులుగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమలాపూర్ నియోజకవర్గకేంద్రంతోపాటు ఆ నియోజకవర్గంలో ఉన్న జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట(కొత్తగా ఏర్పడిన మండలం), హుజూరాబాద్ (మొత్తం ఐదు మండలాలు)తో కలిపి ముఖచిత్రంగా మారింది. ఇక కమలాపూర్ నియోజకవర్గం పూర్తిగా కనుమరుగైంది.



కేతిరి శాయిరెడ్డి



ఇనుగాల పెద్దిరెడ్డి



ముద్దసాని దామోదర్‌రెడ్డి



కేవీ. నారాయణరెడ్డి



పరిపాటి జనార్దన్‌రెడ్డి



కెప్టెన్ లక్ష్మీకాంతారావు



ఈటల రాజేందర్

ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఇలా..

1957లో ఏర్పడిన హుజూరాబాద్‌కు ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ఈ నియోజకవర్గంలో ఉన్న సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను హుస్నాబాద్ నియోజకవర్గంలో.. కమలాపూర్ నియోజకవర్గ కేంద్రంతోపాటు జమ్మికుంట, వీణవంక మండలాలను హుజూరాబాద్‌లో కలిపారు. అప్పటివరకు ఉన్న శంకరపట్నం, మానకొండూర్ మండలాలను విడదీసి కొత్తగా ఏర్పడిన మానకొండూర్ నియోజకవర్గంలో కలిపారు. హుజూరాబాద్ నుంచి 1957లో ఇద్దరు స్వతంత్రులే బరిలో దిగగా.. పోలుసాని నర్సింగరావును గెలిపించారు. 1962లో గాడిపల్లి రాములు (కాంగ్రెస్), 1967లో తిరిగి పోలుసాని నరసింగరావు (కాంగ్రెస్), 1972లో వొడితెల రాజేశ్వరరావు (కాంగ్రెస్), 1978లో దుగ్గిరాల వెంకట్రావు (కాంగ్రెస్), 1983లో కొత్త రాజిరెడ్డి (స్వతంత్ర), 1985లో దుగ్గిరాల వెంకట్రావు (టీడీపీ), 1989లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కేతిరి సాయిరెడ్డి విజయం సాధించారు. ఇక 1994, 1999లో వరుసగా ఇనుగాల పెద్దిరెడ్డి (టీడీపీ) గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి కెప్టెన్ లక్ష్మీ కాంతరావును ఆదరించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతారావు టీఆర్‌ఎస్ నుంచి గెలిచారు. పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి ఈటల రాజేందర్, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈటల ఘన విజయం సాధించారు. 2014, 2018లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ ఈటల రాజేందర్ టీఆర్‌ఎస్ నుంచే గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్ బీజేపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2004వరకు జమ్మికుంటలో నామినేషన్ వేసే ఇక్కడి అభ్యర్థులు.. 2009 నుంచి హుజూరాబాద్ నియోజకవర్గ కేంద్రంలోనే వేస్తున్నారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

నియోజకవర్గం వ్యవసాయ ఆధారితం. ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే కాకతీయకాలువ ద్వారా ఈ నియోజకవర్గంలోని నా లుగు మండలాల్లో 59 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జమ్మికుంటలోని పత్తిమార్కెట్ ఉత్తర తెలంగాణలోనే అతి పెద్దదిగా పేరుగాంచిం



ది. సీడ్ ఉత్పత్తిలోనూ హుజూరాబాద్ దేశంలోనే పేరుగాంచింది. జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వ్యవసాయంలో సూచనలు చేస్తూ కొత్త వంగడాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. జమ్మికుంట, ఉప్పల్, బిజిగిర్‌షరీఫ్‌లో ఉన్న రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణికులకు రవాణా సులువవుతోంది.

మొత్తం ఓటర్లు 2,44,514

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 106 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలు ఉండగా, మొత్తం 305 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 2,44,514 మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 1,19,676 మంది పురుషులు, 1,24,833 మహిళలు, ఇతరులు ఐదుగురు ఉన్నారు.

ఏడాది	గెలుపు	పార్టీ	ఓటమి	పార్టీ
1957	పి.నరసింగరావు	స్వతంత్ర	గాడిపెల్లి రాములు	స్వతంత్ర
1962	గాడిపెల్లి రాములు	కాంగ్రెస్	నాయిని దేవయ్య	సీపీఐ
1967	పి.నరసింగరావు	కాంగ్రెస్	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర
1972	వి.రాజేశ్వర్‌రావు	కాంగ్రెస్	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	స్వతంత్ర
1978	డి.వెంకట్రావు	కాంగ్రెస్	ఎ.కాశీవిశ్వనాథరెడ్డి	జనతా
1983	కొత్త రాజిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	స్వతంత్ర
1985	డి.వెంకట్రావు	టీడీపీ	భాస్కర్‌రెడ్డి	కాంగ్రెస్
1989	కేతిరి సాయిరెడ్డి	స్వతంత్ర	డి.వెంకట్రావు	టీడీపీ
1994	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	బి.లక్ష్మీకాంతరావు	కాంగ్రెస్
1999	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ	కేతిరి సాయిరెడ్డి	కాంగ్రెస్
2004	బి.లక్ష్మీకాంతరావు	టీఆర్‌ఎస్	ఇనుగాల పెద్దిరెడ్డి	టీడీపీ
2008	వి.లక్ష్మీకాంతరావు	టీఆర్‌ఎస్	కె.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2009	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	వి.కృష్ణమోహన్‌రావు	కాంగ్రెస్
2010	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	ఎం.దామోదర్‌రెడ్డి	టీడీపీ
2014	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	కే.సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్
2018	ఈటల రాజేందర్	టీఆర్‌ఎస్	పాడి కౌశిక్‌రెడ్డి	కాంగ్రెస్
2021	ఈటల రాజేందర్	బీజేపీ	గెల్లు శ్రీనివాస్‌యాదవ్	టీఆర్‌ఎస్

అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో

గోదావరిఖని: సబ్బండ వర్గాలకు లబ్ధిచేకూరేలా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఉందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. 29వ డివిజన్ బస్టాండ్ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.16వేలు, రేషన్ కార్డులో పేరదారునికి సన్న బియ్యం పంపిణీ, ఆసరా పింఛన్లు రూ.5 వేలకు పెంపు, వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంపు తదితర పథకాలను మానిఫెస్టోలో పెట్టారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు అచ్చే వేణు, కలువల సంజీవ్, పీచర శ్రీనివాస్, తోకల రమేష్, బసవరాజ్, గంగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

–ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

జ్యోతినగర్: కోరుకంటి చందర్‌ను ప్రజలు ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వెంకటేశ్ నేత అన్నారు. ఆదివారం రాత్రి రామగుండం కార్పొరేషన్ మేడిపల్లి సెంటర్‌లో జరిగిన ప్రజా అంకితయాత్రలో పాల్గొని ఆయన మాట్లాడారు. మూడు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా.. 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలా అని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రజా అంకితయాత్రలో పాల్గొన్న ప్రజలు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో ప్రజా అంకిత యాత్రలో భాగంగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రజలకు వివరించాలన్నారు.

'కోరుకంటి' గెలుపు ఖాయం

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ గెలుపు ఖాయమని ప్రభుత్వ విప్, చెన్నూరి ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. చందర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి అసత్యప్రచారాలు మానుకోవాలన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

బీజేపీ నుంచి సాధుల రాంబాబుతో పాటు జంగాలపల్లె, న్యూపోరట్‌పల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రజా అంకిత యాత్రలో ఓ వ్యక్తి కోడిగుడ్డు విసరడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వ్యాపారులను కాపాడుకుంటా



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: వ్యాపారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా కాపాడుకునే బాధ్యత తనదేనని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక గౌతమి బుద్ధ ఫంక్షన్‌హాల్‌లో ధర్మపురి దేవస్థానం ఆలయ కమిటీ డైరెక్టర్, ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు జైన రాజమౌళి ఆధ్వర్యంలో ఆదివారం వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలువురు వ్యాపారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తేవడంతో ఆయన స్పందించారు. వ్యాపారులను దెబ్బతీసేలా పెద్ద సంస్థలు ముందుకు వస్తే సహకరించబోమన్నారు. ధర్మారంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ ఫంక్షన్‌హాల్ నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. తనకు మరోఅవకాశం ఇస్తే మరింత అభివృద్ధి పర్చుతానని మంత్రి హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు, సర్పంచ్ పుస్కూరి జితేందర్ రావు, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, విద్యార్థి విభాగం నియోజకవర్గ కో కన్వీనర్ మాధవరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ప్రధానకార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, గిరిజన విభాగం అధ్యక్షు డు అజ్మీర మల్లేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఆశీర్వాద యాత్రకు స్పందన

ధర్మారం:గోపాల్‌రావుపేట, సాయంపేటలో మంత్రి చేపట్టిన ప్రజాఆశీర్వాదయయాత్రకు స్పందన లభించింది. మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు గ్రామస్తులు, అభిమానులు ఘనస్వాగతం తెలిపారు. మంత్రి ఈశ్వర్ కాలి నడకన ఇంటింటా పర్యటిస్తూ తనకు ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ సాయికుమార్, ఎంపీపీ కరుణశ్రీ, జెడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: మండలంలోని గౌరెడ్డిపేట శివారులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో రాపెల్లి లక్ష్మయ్య (60) అనే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. గౌరెడ్డిపేటకు చెందిన లక్ష్మయ్య పెద్దపల్లిలో నివాసముంటున్నాడు. శనివారం గ్రామంలోని తన పొలంవద్దకు వెళ్లాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కోట భరత్ ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్, మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు మేరకు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గోదావరిఖని: దుర్గానగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మైనార్టీ కుటుంబ సభ్యులు, సిక్కులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరగా వారికి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ప్రతి పేద కుటుంబానికి పార్టీ పార్టీ ప్రకటించని ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 15వ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేటర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షురాలు స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి స్వప్న, పలువురు మహళలు పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం ఇస్తున్న మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బదావత్ హరిహర నాయక్‌ను నియమించినట్లు ఆదివారం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మాక్కాన్ సింగ్ ప్రకటించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఆయన అందజేశారు.

అవినీతి రహిత పాలన అందిస్తా

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం నియోజకవర్గంలోని ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తామని నియోజకవర్గ స్వతంత్ర్య అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ అన్నారు. రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం, వీర్లపల్లి, పాలకుర్తి మండలం గుంటురుపల్లి, ఎలకలపల్లి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు కోలాటాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో ఉద్యోగాలతో మోసపోయిన బాధితులకు అండగా ఉంటానన్నారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీఇచ్చారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సోమారపు లావణ్య అరుణ్ కుమార్, జాలి రాజమణి, కుసుమ, భిక్షపతి, పిడుగు కృష్ణ, ప్రవీణ్, వీరన్న, చంద్రశేఖర్, అశోక్, కిశోర్, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సోమారపు సత్యనారాయణ

కండువాలు మారుతున్నాయ్



మాజీ ఎంపీపీ సీఎస్సార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్



బీఎస్పీలో చేరిన కౌన్సిలర్ భాగ్యలక్ష్మి



బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

- ఎన్నికల వేళ పార్టీలు మారుతున్న నేతలు
- తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర పోటీ
- ద్వితీయశ్రేణి నాయకులతో ప్రధాన పార్టీల బేరాలు..!

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయ్.. ఈసారి ఎమ్మెల్యే పదవి ఎలాగైనా దక్కించుకోవాలనే ఆరాటంతో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న ద్వితీయశ్రేణి నాయకులను తమవైపు తిప్పుకునేందుకు 'ఆఫర్లు' ఇస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిపై ఉన్న వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునేందుకు ఓ వైపు కాంగ్రెస్, మరో వైపు బీఎస్పీ పార్టీల నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిత్వాన్ని ఇంకా ఖరారు చేయకపోవడంతో ఆ పార్టీనేతలు ఈదిశగా చొరవ చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధానపార్టీల 'దూకుడు'..

పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికే బీఆర్‌ఎస్ టికెట్ ఖరారు కావడం.. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అభ్యర్థిత్వం ఖరారైంది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీలో ఉన్నవారిని తమవైపు తిప్పుకొని పార్టీలో చేర్చుకునేందుకు పోటీపడుతున్నారు. అయితే తామేమీ తక్కువా..అన్నట్టు బహుజన సమాజ్ పార్టీ కూడా గ్రామ, మండల, మున్సిపాలిటీల్లోని నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎంఐఎం నుంచి కౌన్సిలర్లుగా గెలుపొందిన బొంకూరి భాగ్యలక్ష్మి, కార్తీక్ బీఎస్పీలో చేరారు. బీఎస్పీ అభ్యర్థిగా బరిలో నిలిచిన దాసరి ఉష నియోజకవర్గవ్యాప్తంగా ఏనుగు బొమ్మ గుర్తుతో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

నేతల స్థాయిని బట్టి 'ఆఫర్లు'...!

ఓ పార్టీ నుంచి మరో పార్టీలోకి మారే నాయకుడి స్థాయిని బట్టి ఆఫర్లు ప్రకటిస్తున్నారన్న చర్చ బహిరంగగానే వినిపిస్తోంది. కౌన్సిలర్, వార్డు సభ్యుడు, మాజీ సర్పంచ్, సర్పంచ్ స్థాయి ఇలా ఎవరి స్థాయిని బట్టి వారి వద్దకు వెళ్లి ఈ ఎన్నికల్లో తమకు మద్దతిస్తే ఇంత ముట్టజెపుతామని తెలుపుతూ చేరిక సమయంలో అందిస్తున్నట్టు తెలుస్తోంది.

ఏ పార్టీలోకి ఎప్పుడు వెళ్తారో..

వచ్చేనెల జరగనున్న ఎన్నికల నాటికి ప్రస్తుతం పార్టీలో ఉన్న నేతలు ఏ పార్టీలోకి ఎప్పుడు మారుతారో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు నాయకులు ఉదయం ఓ పార్టీ, సాయంత్రం మరో పార్టీలోకి మారిన సందర్భాలున్నాయి. బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన (మాజీ ఎంపీపీ) సి. సత్యనారాయణరెడ్డి, మరో మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తితో కలిసి కాంగ్రెస్‌లో చేరగా తిరిగి బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సొంత గూటికి చేరారు. ప్రస్తుతం శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్న ప్రధాన పార్టీల్లోకి పలువురు నేతలు పార్టీలు మారడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రచారం ఊపందుకునే సమయానికి ఎవరు ఏపార్టీలోకి వెళ్తారో వేచి చూడాల్సిందే.

ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడ్డా



మాట్లాడుతున్న చంద్రమౌళిగౌడ్

సుల్తానాబాద్ రూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి గెలుపుకోసం గతంలో తాను సొంతంగా రూ.8లక్షలు ఖర్చు చేశానని, ప్రస్తుతం ఆయన తనను పట్టించుకోవడం లేదని నారాయణపూర్ మాజీ ఎంపీటీసీ పొన్నం చంద్రమౌళిగౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌లోని కొండావీరయ్య ఫంక్షన్‌హాల్ ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాసరి మనోహర్‌రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసే సమయంలో సొంతంగా డబ్బులు ఖర్చు చేశానని, తన వైన్స్‌షాపుల ద్వారా తొలుత రూ.5లక్షలు, రెండోసారి రూ.3లక్షల విలువైన మద్యం ఓటర్లకు అందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు గ్రామాభివృద్ధికి సహకరించలేదని విమర్శించారు. తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.